సాక్షి
కామారెడ్డి
గురువారం । 26 । జూన్ । 2025



నాణ్యమైన విద్య..
నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా సర్కారు చర్యలు తీసుకుంటోందని ఇంటర్ నోడల్ అధికారి నలాం తెలిపారు.
- 8లో ▸



పెట్టుబడి తక్కువ
జిల్లాలో ఆయిల్‌పాం తోటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.3 /23.8

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతం అవుతుంది. అక్కడక్కడ గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

‘ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి’



బాన్సువాడ : తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనందం ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పట్టణంలోని రెడ్డి సంఘంలో నిర్వహించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2017 పే స్కేల్ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని, కనీస పెన్షన్ రూ. 7,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు పద్మారావు, పోశెట్టి, రాజన్న, కౌసర్, శంకర్ పాల్గొన్నారు.

మైనారిటీ పాఠశాల తనిఖీ




కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలను బుధవారం జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి దయానంద్ తనిఖీ చేశారు. భోజనశాల, స్టోర్‌రూం, వంటశాల, విద్యార్థుల గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

రేపటి ధర్నాను విజయవంతం చేయాలి



కామారెడ్డి టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేయనున్నట్లు టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాల వద్ద ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఈ ధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతల లింగం, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేవులా, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, టీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి విజయరామరాజు, టీటీయూ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

‘రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలి’



దోమకొండ: స్లాట్ విధానం ప్రకారం రిజిస్ట్రేషన్లు చేయాలని, రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రిజిస్ట్రార్ ప్రసూన సూచించారు. బుధవారం దోమకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ప్రతి డాక్యుమెంట్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. స్లాట్ విధానంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ రమేష్, సిబ్బంది రాజిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో చంద్రశేఖర్‌రెడ్డి వాంగ్మూలం



కామారెడ్డి టౌన్: ఫోన్ ట్యాపింగ్ కేసులో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం సిట్ ముందు హాజరయ్యారు. ఆయన తన లీగల్ టీంతో కలిసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లోని సిట్ కార్యాలయంలో సుమారు రెండు గంటల పాటు వాంగ్మూలం ఇచ్చారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో జరిగిన ఘటనల గురించి జూబ్లీహిల్స్ ఏసీపీ, సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఆయన పీఏ కరుణాకర్‌రెడ్డి, డ్రైవర్ అశోక్, కాంగ్రెస్ నాయకుడు అరవింద్ కుమార్ సైతం సిట్ ముందు హాజరయ్యారు.



సీఎంఆర్.. చకచకా..

- పూర్తయిన 2023–24 ఖరీఫ్ లక్ష్యం
- కొనసాగుతున్న తదుపరి సీజన్ల ధాన్యం మిల్లింగ్ ప్రక్రియ
- నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి కావడంతో అధికార యంత్రాంగం సేకరించిన ధాన్యాన్ని మరాడించే ప్రక్రియ (కస్టం మిల్లింగ్ రైస్)పై దృష్టి సారించింది. 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేశారు. ఆ తర్వాతి సీజన్ల లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

– కామారెడ్డి క్రైం

జిల్లాలో 162 రైస్ మిల్లులున్నాయి. వాటిలో 35 బాయిల్డ్, 127 రా రైస్‌మిల్లులు. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపుతారు. మిల్లుల యజమానులు నిర్దేశించిన సమయంలో వడ్లను మరాడించి, బియ్యంను ప్రభుత్వ గోదాములకు తరలించాల్సి ఉంటుంది. గతంలో సీఎంఆర్ విషయంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించేవారు. దీంతో మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించేవారు. సీఎంఆర్ విషయంలో చాలామంది రైస్ మిల్లర్లు మొండికేసేవారు. బియ్యాన్ని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకునేవారు. అధికారులు ఎన్నిసార్లు సూచించినా, నోటీసులు జారీ చేసినా పట్టించుకునేవారు. కానీ ఏడాది కాలంగా పరిస్థితుల్లో మార్పు కనిపిస్తోంది. ప్రభుత్వ ఆదేశాలతో సీఎంఆర్ ప్రక్రియను గాడిలో పెట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైస్ మిల్లులను నిరంతరం పర్యవేక్షిస్తూ సకాలంలో సీఎంఆర్ పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ విషయంలో ఇటీవల వంద శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. అలాగే 2023–24 యాసంగి సీజన్‌కు సంబంధించి 75 శాతం, 2024–25 ఖరీఫ్‌కు సంబంధించి 50 శాతం సీఎంఆర్ పూర్తయిందని అధికారులు తెలిపారు. ఇటీవల సేకరించిన యాసంగి ధాన్యం మిల్లింగ్ కూడా ఇటీవలే ప్రారంభమైందన్నారు.

పర్యవేక్షిస్తున్నాం



జిల్లాలో మిల్లింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. మిల్లులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. సకాలంలో పూర్తి చేయకపోతే సంబంధిత మిల్లుల యజమానులపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా మిల్లింగ్ పూర్తయ్యేలా చూస్తాం.

– రాజేందర్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్, కామారెడ్డి

పర్యటిస్తూ.. సమీక్షిస్తూ..

సీఎంఆర్ విషయంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి పర్యటనలతో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ సీఎంఆర్‌పై సమీక్షిస్తున్నారు. మిల్లుల వారీగా గడువు నిర్దేశించి సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. దీంతో సీఎంఆర్ లక్ష్యం దిశగా సాగుతోంది.

మిల్లుల నుంచి బ్యాంక్ గ్యారంటీలు..

గతంలో చాలామంది మిల్లర్లు ధాన్యం తీసుకుని బియ్యం ఇచ్చేవారు కాదు. రూ. కోట్లల్లో బకాయిలు వసూలయ్యేవి కావు. నోటీసులు ఇచ్చినా, కేసులు పెట్టినా ఫలితం ఉండేది కాదు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రైస్‌మిల్లుల విషయంలో కొత్త నిబంధనలు, షరతులు తీసుకువచ్చింది. ధాన్యం కేటాయించాలంటే ప్రతి రైస్‌మిల్లు యజమాని తనకు కేటాయించే ధాన్యం విలువకు సమానమైన బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది. గత సీజన్ నుంచి ఈ విధానం అమలులోకి తీసుకువచ్చారు. 2024–25 ఖరీఫ్ ధాన్యం కేటాయింపులకుగాను దాదాపు అందరు రైస్ మిల్లర్లు గ్యారంటీలు సమర్పించారు. గతంలో డీఫాల్టర్లుగా ఉన్న 16 మిల్లులకు ఖరీఫ్ ధాన్యం ఇవ్వలేదు. 2024–25 యాసంగి ధాన్యాన్ని 136 మిల్లులకు కేటాయించారు. ఇందులో 67 మంది గ్యారంటీలు సమర్పించగా మరో 69 మంది ఇవ్వాల్సి ఉంది. రెండు, మూడు రోజుల్లో గ్యారంటీలు తీసుకోవడం వంద శాతం పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.

చిత్తు చేస్తున్న మత్తు

జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు

- విద్యార్థులు, యువకులే లక్ష్యంగా దందా
- నేడు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మత్తుపదార్థాల సేవనం సరదాగా మొదలై, అలవాటుగా మారి చివరికి దానికి బానిసలను చేస్తుంది. ముఖ్యంగా గంజాయి మత్తుతో మజా చేస్తున్నవారు భ్రాంతిలో బతుకుతున్నారు. వాళ్లకు తగ్గట్టుగానే గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. ఎక్కడెక్కడి నుంచో గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం గంజాయికి చెక్ పెట్టడంపై దృష్టి సారించింది. మాదకద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన కల్పించేందుకు గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించనున్నారు. సీఎస్‌ఐ చర్చి గ్రౌండ్స్ నుంచి కళాభారతి వరకు ‘మత్తు విముక్తికి ర్యాలీ’ పేరుతో నిర్వహించే కార్యక్రమంలో ఎస్పీ రాజేశ్ చంద్ర ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

చర్యలు తీసుకుంటున్నా..

గంజాయి అమ్మకాలను కట్టడి చేయడానికి పోలీసు శాఖ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా విక్రయాలు మాత్రం తగ్గడం లేదు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. ప్రధానంగా యువత, విద్యార్థులను టార్గెట్‌గా చేసుకుని గంజాయి విక్రయదారులు దందా సాగిస్తున్నారు. సులువుగా దొరుకుతుండడంతో చాలామంది గంజాయి సేవిస్తున్నారు. గతంలో ఎక్కడో దొరికితే తెచ్చుకుని చాటుమాటుగా పీలుస్తూ ఎంజాయ్ చేసేవారు. ఇప్పుడు పరిస్థితులు అన్నీ వారికి అందుబాటులోకి వచ్చాయి. అంతా చైన్ సిస్టం నడుస్తోంది. ఒక దోస్తుకు పరిచయం ఉంటే చాలు.. ఆ ఒక్కడి ద్వారా అందరికీ ఉన్న చోటుకే సరఫరా అవుతోంది. గంజాయి విక్రయించేవారికి ఫోన్‌లు చేయడం, తామున్న చోటుకు రమ్మని సమాచారం ఇవ్వడంతో క్షణాల్లో చేరుకుని చేతుల్లో పెట్టి వెళుతున్నారు. పట్టణంతో పాటు పట్టణ శివార్లలోని పలు అడ్డాల్లో గంజాయి అమ్మకాలు పెద్ద ఎత్తున జరుగుతున్నట్టు తెలుస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కూడా గంజాయి విక్రయాలు పెరిగినట్లు సమాచారం.

మత్తు విముక్తికి పోరాటం



మత్తు పదార్థాలు యువత భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయి. వాటి దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో జిల్లా కేంద్రంలో మత్తు విముక్తికి సమష్టి పోరాటం పేరుతో ర్యాలీ నిర్వహిస్తున్నాం. ర్యాలీలో పెద్ద సంఖ్యలో జనం పాల్గొనాలి. ఆరోగ్యకరమైన, మత్తు రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

– రాజేశ్ చంద్ర, ఎస్పీ, కామారెడ్డి

విద్యార్థులు సైతం..

జిల్లాలో గంజాయిలాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడ్డ చాలామంది యువత జీవితాలు చిత్తయ్యాయి. జిల్లా కేంద్రంలో వందలాది మంది గంజాయి బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. స్కూల్ విద్యార్థులు కూడా కొందరు గంజాయి సేవిస్తుండడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఇటీవల పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఓ తొమ్మిదో తరగతి విద్యార్థి గంజాయికి అలవాటు పడి స్కూల్‌కు డుమ్మా కొడుతూ బయట తిరుగుతున్నాడు. అతడి తల్లిదండ్రులు స్కూల్‌కు వెళ్లగా.. వారం రోజులుగా బడికి రావడం లేదని తెలిసి కంగుతిన్నారు. అతడి తండ్రి ఆరా తీయగా గంజాయి బ్యాచ్‌కు దోస్త్ అయ్యాడని తెలిసింది. దీంతో అతడిని వెంటనే హైదరాబాద్‌కు తీసుకువెళ్లి మత్తు అలవాటును మాన్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన యువకుడొకరు గంజాయి మత్తులో బైక్ రేసింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. పిల్లలకు అవసరాలు ఉంటాయని తల్లిదండ్రులు అడిగినన్ని డబ్బులు ఇస్తుంటే కొందరు పిల్లలు వాటిని దుర్వినియోగం చేస్తూ మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

ఓపెన్ స్థలానికి ఎల్‌ఆర్‌ఎస్

- కామారెడ్డి బల్దియా అధికారుల తీరు
- ఫీజు వాపస్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారంటున్న బాధితుడు



బల్దియాకు చెల్లించిన చెక్ జిరాక్స్‌లను చూపిస్తున్న బాధితుడు నగేశ్

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్‌లోగల గ్రీన్ సిటీలో ఓపెన్ స్థలానికి బల్దియా అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు వసూలు చేశారు. ఆ తర్వాత ఎల్‌ఆర్‌ఎస్ తిరస్కరించినా ఫీజు మాత్రం తిరిగి ఇవ్వడం లేదు. దీంతో బాధితుడు పదేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి పట్టణానికి చెందిన జ్యోత్స్న, నగేశ్ దంపతులు సిరిసిల్ల రోడ్‌లోని గ్రీన్ సిటీలో సర్వే నంబర్ 48లో బల్దియా ఓపెన్ స్థలమని తెలియక 120 గజాల ప్లాటు తీసుకున్నారు. డాక్యుమెంట్ నంబర్ 1390/2002తో రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. 2012లో ఇంటి నిర్మాణ అనుమతి కోసం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులను సంప్రదించగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఫీజు రూ. 35,224 డీడీ కట్టించుకున్నారు. మళ్లీ మూడేళ్ల తర్వాత ఇంటి నిర్మాణ అనుమతి కోసం వెళ్లగా.. అది మున్సిపల్ ఓపెన్ స్థలం అంటూ ఎల్‌ఆర్‌ఎస్‌నూ తిరస్కరించారు. నిబంధనల ప్రకారం ప్రాసెసింగ్ ఫీజు మినహాయించి మిగతా డబ్బును బాధితుడికి తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ పదేళ్లవుతున్నా ఇప్పటికీ రూపాయి కూడా తిరిగివ్వలేదు. పదేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా నని, డబ్బులు ఇవ్వడం కుదరదని, ఏం చేసుకుంటావో చేసుకో అంటూ అధికారులు బెదిరిస్తున్నారని బాధితుడు నగేశ్ తెలిపారు. బుధవారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగాడు. గ్రీన్ సిటీలో మున్సిపల్ ఓపెన్ స్థలాలను కొనుగోలు చేసిన 15 మందినుంచి భారీగా డబ్బులు తీసుకుని ఎల్‌ఆర్‌ఎస్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయమై టీపీవో గిరిధర్‌ను వివరణ కోరగా 13 ఏళ్ల క్రితం జరిగిన విషయం కాబట్టి ఫైల్‌ను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు.

పెట్టుబడికి ‘భరోసా’

- జిల్లాలో 3,03,944 మంది రైతులకు లబ్ధి
- ఖాతాల్లో రూ. 306.47 కోట్లు జమ



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పంటల సాగుకు అవసరమైన పెట్టుబడుల కోసం సర్కారు వానాకాలం సీజన్ ఆరంభంలోనే రైతు భరోసా నిధులు విడుదల చేసింది. జిల్లాలో 3,28,231 మంది రైతులకు రూ. 314 కోట్లు రావాల్సి ఉండగా.. మంగళవారం రాత్రి వరకు 3,03,944 మంది రైతుల ఖాతాల్లో రూ. 306 కోట్లు జమయ్యాయి. మరో 24,287 మందికి పెట్టుబడి సాయం అందాల్సి ఉంది.

గత యాసంగి సీజన్‌లో రైతు భరోసా నిధులను విడదలవారీగా విడుదల చేశారు. అదీ అరకొరగానే.. ఆ సీజన్‌లో మూడున్నర ఎకరాలలోపు రైతులకే రైతు భరోసా నిధులు జమ అయినట్లు తెలుస్తోంది. జిల్లాలో చాలామందికి పెట్టుబడి సాయం అందలేదు. ఖరీఫ్ సీజన్‌కు వచ్చేసరికి సర్కారు వేగంగా స్పందించింది. సీజన్ ఆరంభంలోనే నిధులు విడుదల చేసింది. ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఇప్పటివరకు రూ. 306.47 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. మరో రూ. 8 కోట్ల వరకు సాయం అందాల్సి ఉంది. జిల్లాలో అత్యధికంగా గాంధారి మండలంలో 19,772 మంది రైతులకు రూ. 26.46 కోట్లు, తరువాత జుక్కల్ మండలంలో 17,007 మంది రైతులకు రూ. 22.70 కోట్ల రైతుభరోసా సొమ్ము జమయ్యింది. తక్కువ భూమి ఉన్న మహ్మద్‌నగర్ మండలంలో 6,154 మంది రైతులకు రూ.4.37 కోట్లు వచ్చాయి. రైతుభరోసా సొమ్ము పడడంతో పలు మండలాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

మండలాల వారీగా రైతు భరోసా వివరాలు...

మండలం	మొత్తం రైతులు	రావలసిన భరోసా డబ్బు(రూ. కోట్లలో)	భరోసా వచ్చిన రైతులు	అందిన డబ్బు (రూ. కోట్లలో)
మహ్మద్‌నగర్	6,554	4.50	6,154	4.37
నిజాంసాగర్	7,116	5.56	6,748	5.47
నస్రుల్లాబాద్	10,032	7.85	9,260	7.51
పల్వంచ	7,921	8.00	7,296	7.74
దోమకొండ	8,659	8.22	7,776	8.04
బీబీపేట	10,609	8.51	9,640	8.35
రాజంపేట	10,470	8.68	9,955	8.46
బీర్కూర్	9,631	8.79	9,071	8.59
మాచారెడ్డి	8,344	9.29	7,771	9.04
రామారెడ్డి	11,692	9.69	10,865	9.36
ఎల్లారెడ్డి	14,629	9.92	13,547	9.68
నాగిరెడ్డిపేట	13,991	9.90	13,318	9.68
పెద్దకొడప్‌గల్	8,099	10.05	7,537	9.84
కామారెడ్డి	16,853	10.61	13,772	10.15
డోంగ్లీ	8,831	11.21	8,257	10.96
బాన్సువాడ	15,034	12.22	13,906	11.91
భిక్కనూరు	15,606	14.08	14,468	13.73
లింగంపేట	18,856	15.80	17,359	15.22
పిట్లం	17,291	16.18	16,375	15.81
సదాశివనగర్	16,986	17.99	16,329	17.64
తాడ్వాయి	16,763	18.71	15,833	18.28
మద్నూర్	15,693	18.77	14,433	18.41
జుక్కుంద	19,339	19.46	17,495	18.93
జుక్కల్	18,513	23.16	17,007	22.70
గాంధారి	20,719	26.95	19,772	26.46
	3,28,231	314.21	3,03,944	306.47

‘మత్తు పదార్థాలతో జీవితం చీకటిమయం’



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఏఎస్పీ చైతన్యరెడ్డి, అధికారులు, నాయకులు, విద్యార్థులు

భిక్కనూరు: మత్తుపదార్థాలతో అనర్థాలు జరుగుతాయని, జీవితాలు చీకటిమయం అవుతాయని కామారెడ్డి అసిస్టెంట్ ఎస్పీ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. బుధవారం భిక్కనూరులో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్య వినియోగ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గమనించాలని, వారి స్నేహాల గురించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు, సీఐ సంపత్‌కుమార్, ఎస్సై అంజనేయులు, ఎంపీడీవో రాజ్‌గంగారెడ్డి, ప్రభుత్వ వైద్యురాలు యెమిమా, హెచ్‌ఎం శ్రీనాథ్, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీరాం వెంకటేశ్, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జూలై 16న తెయూ రెండో కాన్వొకేషన్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో రెండో కాన్వొకేషన్‌ను జూలై 16న ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని వైస్–చాన్స్‌లర్ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) మాజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ హాజరుకానున్నారు. వర్సిటీ కంట్రోలర్, డీన్స్, ప్రిన్సిపాల్స్, డైరెక్టర్స్, అధ్యాపకులతో బుధవారం వీసీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాన్వొకేషన్ విజయవంతం చేయడానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి కన్వీనర్‌గా 13 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కమిటీల కన్వీనర్లు క్రమశిక్షణతో కాన్వొకేషన్ పనులను పూర్తిచేసి విజయవంతం చేయాలని సూచించారు. వర్సిటీ ప్రారంభమైన తర్వాత 13 నవంబర్ 2013న మొదటి కాన్వొకేషన్ నిర్వహించారని, రెండో కాన్వొకేషన్ కోసం అప్పటి వీసీ ప్రొఫెసర్ పీ సాంబయ్య హయాంలో 6 జూలై 2018న, మళ్లీ గత వీసీ ప్రొఫెసర్ రవీందర్ గుప్తా హయాంలో 12 మార్చి 2020న నోటిఫికేషన్లు ఇచ్చినప్పటికీ పలు కారణాలతో వాయిదా పడినట్లు వీసీ తెలిపారు. ప్రస్తుతం వీసీగా తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత 14 నవంబర్ 2024న కాన్వొకేషన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రొఫెసర్ యాదగిరిరావు తెలిపారు. పీజీ, యూజీలో వివిధ విభాగాల నుంచి మొదటి ర్యాంకు సాధించిన 130 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్‌తోపాటు సుమారు 70 మంది స్కాలర్స్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాలను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందించనున్నట్లు వీసీ తెలిపారు.

క్లుప్తంగా

కుమ్మర్ల తొలి బోనం జాతర కరపత్రాల ఆవిష్కరణ



బాన్సువాడ : ఈ నెల 26న హైదరాబాద్‌లో నిర్వహించే కుమ్మర్ల తొలి బోనం జాతరకు సంబంధించిన కరపత్రాలను జిల్లా శాలివాహన కుమ్మర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు దుర్కి నారాయణ బుధవారం బాన్సువాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆషాడమాసం పురస్కరించుకుని కనకాల కట్టమైశమ్మ గుడి లోయర్ ట్యాంకు బండ్ హైదరాబాద్‌లో నిర్వహించే జాతరను విజయవంతం చేయాలని కోరారు. కుమ్మరులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, మండల అధ్యక్షులు దత్తు, నాయకులు పాపయ్య, మోహన్, సుభాష్, తదితరులున్నారు.

సమావేశానికి పెద్ద ఎత్తున హాజరు కావాలి



దోమకొండ: కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి మండలానికి చెందిన పార్టీ కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్ గౌడ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. మాచారెడ్డి మండల కేంద్రంలో జరిగే నియోజకవర్గ స్థాయి సమావేశానికి అతిథులుగా ఏఐసీసీ ఇంచార్జి విశ్వనాథన్, మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ హాజరవుతారని తెలిపారు. నేతలు నర్సారెడ్డి, శంకర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన మెటీరియల్ వాడాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): నాణ్యమైన మెటీరియల్‌తో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి సూచించారు. బుధవారం చావుని తండాలో నూతన జీపీ భవనానికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నేతలు శామప్ప పటేల్, గోపాల్ పాల్గొన్నారు.

'కంటికి అభివృద్ధి కనపడకపోవడం బాధాకరం'



బిచ్కుంద(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలో గతంలో కంటే ఎక్కువ అభివృద్ధి జరుగుతోందని, అభివృద్ధి బీజేపీ నాయకుల కంటికి కనపడకపోవడం బాధాకరమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం బిచ్కుంద ఏఎంసీ కార్యాలయం సమావేశంలో ఆయన మాట్లాడారు. 11 ఏళ్ల కేంద్రంలో బీజేపీ ఉంది.. జిల్లా, నియోజకవర్గ నాయకులు జుక్కల్ అభివృద్ధి కోసం చిల్లి గవ్వ నిధులు ఎందుకు తీసుకురాలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షం నాయకులు కండ్లు మండుతున్నాయని ఎద్దేవా చేశారు. నాయకులు జీవన్, లజయ్ పటేల్, నారాయణ, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి తక్కువ.. రాబడి ఎక్కువ

- పామాయిల్ సాగుకు ముందుకు వస్తున్న రైతులు
- జిల్లాలో ఇప్పటికే సుమారు 1,706 ఎకరాల్లో సాగు
- పామాయిల్‌తో పాటు అంతర పంటలకు అవకాశం
- జిల్లాలో పామాయిల్ కంపెనీ ఏర్పాటుపై రైతుల ఆశలు



పామాయిల్ పంటలను పరిశీలిస్తున్న అధికారులు

బీబీపేట: పామాయిల్ సాగుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ప్రోత్సహించేందుకు అవగాహన సదస్సులు నిర్వహించి వారిని సాగు చేసేందుకు సన్నద్ధం చేశాయి. జిల్లా వ్యాప్తంగా రైతులు పామాయిల్ సాగు చేసేందుకు ఇప్పటికే చాలా మంది ముందుకు వచ్చారు. సాగుకు అనువైన పరిస్థితులు ఉండడంతో అధికారులు కూడా రైతులను పూర్తిగా అవగాహన కల్పించారు. అంతే కాకుండా ఉద్యానవన శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రచారం చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 1,706 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం మరో 2,500 ఎకరాల్లో పామాయిల్ తోటలను పెంచేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. పామాయిల్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అనువైన జిల్లాగా కామారెడ్డిని గుర్తించింది. దీంట్లో భాగంగానే గత సంవత్సరం నుంచే రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎవరికైతే సాగు చేయాలనే ఉద్దేశం ఉందో ఆ రైతుల వద్ద నుంచి సంబంధిత పత్రాలను సేకరించారు. జిల్లాలో పామాయిల్ కంపెనీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు కూడా వచ్చాయి. అందుకు అనుగుణంగా 10 ఎకరాల స్థలం కోసం అధికారులు, పామాయిల్ కంపెనీ వారు చూస్తున్నారు. స్థలాన్ని కేటాయించినట్లయితే కంపెనీ నిర్మాణానికి కూడా ముందుకు రానున్నట్లు తెలిసింది.

ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీ..

బిందు సేద్య పరికరాలపై ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, సన్న చిన్న కారు రైతులకు 90 శాతం, మిగతా రైతులకు 80 శాతం రాయితీ ఉంటుంది. అయితే యూనిట్ ధరపై 7 శాతం లేదా, రూ.5 వేలు జీఎస్టీని రైతులే చెల్లించాలి. జనరల్, బీసీ రైతుకు 90 శాతం రాయితీ పోను మిగిలిన మొత్తంతో పాటు జీఎస్టీని చెల్లించాలి. డ్రిప్‌పై హెక్టారుకు యూనిట్ ధర రూ. 47,065 (మైక్రోజెట్స్), కాగా ఎమిటర్స్, మైక్రోజెట్స్ కలిపి యూనిట్ ధర రూ. 47,805 ఉంటుందని అధికారులు తెలిపారు.

మొక్కలపై రాయితీ..

పామాయిల్ సాగుకు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తోంది. సాగుకు బీసీలకు 90 శాతం సబ్సిడీ, ఓసీలకు 80 శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీ రైతులు.. పామాయిల్ మొక్క ఖరీదు రూ.400 కాగా వారు మొక్కకు రూ.20 చెల్లించాల్సి ఉంటుంది. ఒక ఎకరంలో నాటాల్సిన మొక్కలు 50 కాగా రూ. వెయ్యి బ్యాంకు డీడీ తీయాల్సి ఉంటుంది. అలాగే పంట సాగు చేసిన నాలుగేళ్ల పాటు ప్రోత్సాహకాలు అందిస్తుంది.

పామాయిల్ తోటలు పెంచుకోవాలి



జిల్లాలో పామాయిల్ సాగుపై రైతులకు ఇప్పటికే కార్యక్రమాలు చేపట్టి అవగాహన కల్పించాం. అంతే కాకుండా రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఎక్కువ సంవత్సరాలు ఆదాయం పొందేందుకు ఆయిల్‌పామ్ సాగు రైతులకు బాగా ఉపయోగపడుతుంది. ఎకరానికి 50 మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు రైతులు నాలుగేళ్ల పాటు తీసుకుంటే తర్వాత ఆదాయం వస్తుంది.

– జ్యోతి, జిల్లా ఉద్యాన శాఖాధికారి, కామారెడ్డి

మాదకద్రవ్యాల నివారణకు సమష్టి కృషి చేయాలి

బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ విఠల్‌రెడ్డి, పక్కన సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ వరప్రసాద్, సీఐ అశోక్

బాన్సువాడ: మాదక ద్రవ్యాల నివారణకు సమష్టి కృషి చేయాలని బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐ అశోక్, తహసీల్దార్ వరప్రసాద్, ఉపాధ్యాయులు నరహరి తదితరులున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎల్లారెడ్డి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ శ్రీనివాస్‌రావు సూచించారు. బుధవారం ఎల్లారెడ్డిలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీసులు అంబేడ్కర్ చౌరస్తా నుంచి బాలాగౌడ్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేష్, ఎంఈవో రాజులు, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై మల్లారెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో బుధవారం మాదకద్రవ్యాల నిషేధంపై నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీంతోపాటు మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులను పోలీసులు శాలువాతో సత్కరించి వారికి బహుమతులను అందజేశారు. మోడల్‌స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జోత్స్యరాణి, కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

నాణ్యమైన భోజనం అందించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని మాసాన్‌పల్లిలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం నిహారిక ఉన్నారు.

ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. బుధవారం ఆయన శెట్పల్లిలో నిర్మిస్తున్న ఇంకుడు గుంతను పరిశీలించారు. గ్రామాల్లో కార్యదర్శులు ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో నరేందర్, శివరాం ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



శేఖర్(ఫైల్)

భిక్కనూరు: రాజన్న-సిరిసిల్ల జిల్లా అగ్రహారం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. బస్వాపూర్ గ్రామానికి చెందిన ఒంటిద్దు శేఖర్ (23) మూడేళ్లుగా వేములవాడలోని ఓ పెట్రోల్ బంక్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం టిఫిన్ చేసేందుకు అగ్రహారం వద్దకు బైక్‌పై వెళ్లి, తిరిగి వస్తుండగా టాటా ఏసీ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బస్వాపూర్ గ్రామానికి రాత్రి తీసుకవచ్చారు. మృతుడికి తల్లి కళావతి ఉండగా, తండ్రి చిన్నతనంలోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి లంబాడి యువసేవ తరఫున ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.

ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ హనుమాన్ మందిర్ స్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడిపై విద్యార్థి సంఘ నేత దాడి చేయడం హేయమైన చర్య అని కామారెడ్డి ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో వారు మాట్లాడారు. తక్షణమే ఆయనను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా విధులను బహిష్కరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతల లింగం, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దేవులా, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు రాము, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

దాడి హేయమైన చర్య

ఉపాధ్యాయుడిపై దాడి చేయడం హేయమైన చర్య అని తపస్ జిల్లా అధ్యక్షుడు పుల్గం రాఘవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ వ్యక్తిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మా భూములను మాకు ఇప్పించాలి



తాడ్వాయి తహసీల్ కార్యాలయానికి తరలి వచ్చిన బ్రహ్మాజీవాడి రైతులు



రైతులు పొందిన పట్టా పాసు పుస్తకాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): అబ్దుల్లానగర్ శివారులో ఉన్న మా భూములను మాకు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ బ్రహ్మాజీవాడికి చెందిన రైతులు బుధవారం తహసీల్ కార్యాలయానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అబ్దుల్లానగర్ శివారులో గల 89, 95, 106, 122 సర్వే నంబర్లలో 32 మందికి 40 ఎకరాల భూమి ఉందని, 43 ఏళ్లగా సాగు చేసుకుంటున్నామని అన్నారు. గతంలో ఉన్న తహసీల్దార్‌ల తప్పిదం వల్ల కొందరు దొంగ పత్రాలు సృష్టించి కోర్టుకు వెళ్లి ఆ భూములు మావేనని అంటున్నారని వాపోయారు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ శ్వేతకు వినతి పత్రాన్ని అందజేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



కోనాపూర్‌లో పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి



ముత్యంపేటలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

బాన్సువాడ రూరల్: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూనే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బాన్సువాడ డీఎల్‌పీవో వెంకట సత్యనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కోనాపూర్‌లో పర్యటించారు. గ్రామ పంచాయతి ఆధ్వర్యంలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి కార్యదర్శి భరత్‌కుమార్‌ను అభినందించారు.

తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

దోమకొండ: తాగునీరు కలుషితం కాకుండా గ్రామాల్లో పంచాయితీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సూచించారు. ముత్యంపేట గ్రామపంచాయతీలో బుధవారం తాగునీటి పైపులు చెడిపోగా మరమ్మతులు చేయించి మాట్లాడారు. గ్రామంలోని పలు వాటర్‌ట్యాంకులు, పైపులైన్‌లను పరిశీలించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ ఇమ్రాన్

బాన్సువాడ రూరల్: సీజన్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని హన్మాజీపేట్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఇమ్రాన్ సూచించారు. బుధవారం హన్మాజీపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అన్నం తినే ముందు, మల మూత్ర విసర్జనకు వెళ్లి వచ్చిన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఇంటర్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం

లింగంపేట/నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని, దీనిలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో నెలకొన్న అధ్యాపకుల కొరతను తీరుస్తూ గెస్ట్‌లెక్చరర్లను నియమించామని ఇంటర్ విద్య నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. నాగిరెడ్డిపేట, లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతోపాటు అధ్యాపకులతో వేర్వేరుగా మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళాశాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు కలిగినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 5 వేల మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. జిల్లాలో 20 జూనియర్ కళాశాలున్నాయని, వాటిల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఇప్పటివరకు 2,500 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారన్నారు. అనంతరం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపకులు రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

నకిలీ ఇన్సూరెన్స్ కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్

లింగంపేట(ఎల్లారెడ్డి): అమాయకులను మోసం చేస్తూ నకిలీ ఇన్సూరెన్స్ చేయిస్తున్న నిందితులను పట్టుకున్నట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ తెలిపారు. లింగంపేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. లింగంపేట మండల కేంద్రానికి చెందిన సుప్పాల రాజు కొన్నేళ్ల క్రితం తన ఆటోను తాడ్వాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన దూదేకుల మౌలానాకు అమ్మాడు. మౌలానా కొనుగోలు చేసిన ఆటో ప్రమాదానికి గురైంది. దీంతో ఆయన ఇన్సూరెన్సు కోసం రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీకి దరఖాస్తు చేసుకున్నాడు. 2019-20లో హైదరాబాద్ కంపెనీ మేనేజర్ గురువర్ధన్ బీమా పత్రాలు నకిలీవిగా గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నకిలీ ఇన్స్యూరెన్స్ చేయిస్తున్న తండ్రీకొడుకులు తాడ్వాయి మండలం కన్‌కల్ గ్రామానికి చెందిన ఏనుగు సాయిరెడ్డి, శ్రవణ్‌రెడ్డిపై 2019-20లో కేసు నమోదైనట్లు తెలిపారు. దీంతో వీరిని రిమాండు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితులు సుమారు 500లకు పైగా నకిలీ బీమా పత్రాలు తయారు చేసి వాహనదారులకు అందజేసి రూ.లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. 2019-20 సంవత్సరానికి ముందు ఇన్సూరెన్సు పత్రాలు పొంది మోసపోయిన వారు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఎల్లారెడ్డి సీఐ 8712686159 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. లింగంపేట ఎస్సై వెంకట్రావు, సిబ్బంది ఉన్నారు.

రైతులకు నోటీసుల జారీ



నోటీసులు అందజేస్తున్న ఆర్‌ఐ బాలయ్య

భిక్కనూరు: భూభారతిలో వచ్చిన దరఖాస్తుల మేరకు మండలంలోని అంతంపల్లి గ్రామ రైతులకు ఆర్‌ఐ బాలయ్య బుధవారం నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ బాలయ్య మాట్లాడుతూ..రైతులు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో ఇటీవల రెవెన్యూ సదస్సుల్లో అందించారని..వాటికి సంబంధించి రైతులకు నోటీసులు జారీచేసినట్లు వివరించారు.

క్రైం కార్నర్

కరెంట్ షాక్‌తో స్తంభంపైనే ఒకరి మృతి



స్తంభంపై పోశెట్టి మృతదేహం (ఇన్‌సెట్‌లో) పోశెట్టి (ఫైల్)

బోధన్: విద్యుత్ స్తంభం ఎక్కి కరెంట్ తీగల లాగుతుండగా ఓ వ్యక్తి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. నవీపేట ఎస్సై వినయ్ కుమార్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నవీపేట మండలం లింగాపూర్ గ్రామ శివారులోని పంట పొలాల్లో గ్రామానికి చెందిన దినసరి కూలి రెంజర్ల పోశెట్టి (44) బుధవారం ఇదే గ్రామానికి చెందిన రైతు క్లెం శివ పొలంలో కరెంట్ బోరుబావి వద్ద పనికి వెళ్లాడు. బోరుబావికి సంబంధించిన సర్వీస్ వైర్‌ను 11కేవీ లైన్ తీగలున్న స్తంభంపైకి ఎక్కి లాగుతుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో మహిళ..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని వజ్జపల్లి గ్రామంలో పాముకాటుతో ఓ మహిళ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని చర్ల చిన్నమ్మ (52) అనే మహిళ బుధవారం వ్యవసాయ భూమి వద్ద పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. ఇది గమనించిన బంధువులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ మార్గమధ్యలోనే ఆమె మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలికి భర్త భూమయ్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు..





మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు.. సాయిలు (ఫైల్)

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) శివారులో బుధవారం మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ కూలి కడారి చిన్న సాయిలు (37) మృతదేహం లభ్యమయింది. పొలాలకు వెళ్తున్న రైతులు మృతదేహాన్ని గుర్తించి రుద్రూర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్‌ఐ సాయన్న ఆధ్వర్యంలో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా రుద్రూర్‌కు చెందిన కడారి చిన్న సాయిలుగా గుర్తించారు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడం వల్ల అతడు మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య బాలామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లి గ్రామానికి చెందిన రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యాదగిరి గౌడ్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామంలోని కల్లుబట్టీలో రాజారెడ్డి, రవి ఇటీవల ఇరువురు కల్లు సేవించారు. ఆ సమయంలో రవి రాజారెడ్డిని సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. దీన్ని గమనించిన రాజారెడ్డి ఎందుకు వీడియో తీస్తున్నావని ప్రశ్నించాడు. ఈక్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరగగా, రాజారెడ్డిపై రవి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు.

గుండారంలో ఒకరి ఆత్మహత్య

నిజామాబాద్‌రూరల్: గుండారంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీస్‌స్టేషన్ రెండో ఎస్సై ఆనంద్‌సాగర్ తెలిపిన వివరాలు .. గుండారం గ్రామానికి చెందిన కొండెల సాయిరెడ్డి(55) భార్య కొన్నేళ్ల కిందట మృతిచెందింది. అతడికి ఇద్దరు కుమారులు ఉండగా చిన్నకుమారుడు ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లాడు. ఈనెల 22 పెద్ద కుమారుడు భార్యతో కలిసి ఊరికి వెళ్లాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తనను ఎవరూ పట్టించుకోవడం లేదంటూ జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో ఇంట్లో ఉన్న దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం పెద్దకుమారుడు ఇంటికి తిరిగి రాగా, దులానికి వేలాడుతున్న తండ్రి మృతదేహాన్ని చూసి లబోదిబోమన్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గుమ్మిర్యాల్‌లో చైన్ స్నాచింగ్

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్‌లో నేరేళ్ల సాయమ్మ అనే మహిళ మెడ నుంచి బంగారు గొలుసును ఇద్దరు దుండగులు లాక్కొని వెళ్లిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు .. గుమ్మిర్యాల్‌లో తన ఇంటి నుంచి పక్క ఇంటికి వెళుతున్న సాయమ్మను ఇద్దరు వ్యక్తులు బైక్‌తో అడ్డగించి, ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్‌ను ఎత్తుకుని వెళ్లారు. ఈ ఘటన సీసీ కెమెరాలలో రికార్డు అయ్యింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏర్గట్ల పోలీసులు తెలిపారు.

ఫోన్ పే చేశానని బురిడీ

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంక్ సిబ్బందికి ఓ వ్యక్తి ఫోన్ పే చేశానని రూ.9వేలు బురిడీ కొట్టించాడు. వివరాలు ఇలా.. బీర్కూర్‌లోని పెట్రోల్ బంక్‌కు బుధవారం ఓ వ్యక్తి వచ్చి తాను ఫోన్‌పే చేస్తానని, రూ.9 వేలు నగదు ఇవ్వాలని సూచించాడు. దీంతో బంక్ సిబ్బంది అతడిని నమ్మి రూ. 9వేలు ఇవ్వగానే, ఫేక్ ఫోన్ పే చేసి అక్కడి నుంచి జారుకున్నాడు. తీర పెట్రోల్ బంక్ సిబ్బంది ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకున్నారు. బంక్‌లో ఉన్న సీసీ కెమెరాలో దుండగుడి దృశ్యాలు రికార్డు అయ్యాయి. పెట్రోల్ బంక్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో నిందితుడికి 9 నెలల జైలు శిక్ష

కామారెడ్డి క్రైం: తాళం వేసిన ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడికి కామారెడ్డి కోర్టు 9 నెలల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా.. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి దేవీ విహార్ కాలనీలో పరికి సూర్య అనే వ్యక్తి నివాసం ఉండేవాడు. గతేడాది జులై 20న అతడు ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి వేరే ఊరికి వెళ్లాడు. 22న అతడు ఇంటికి తిరిగివచ్చి చూడగా ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు చోరీకి పాల్పడింది కోటిపల్లి చంద్రి అలియాస్ శేఖర్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. కామారెడ్డి కోర్టులో విచారణ జరుగగా అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జి దీక్ష నిందితుడికి 9 నెలలు జైలు శిక్ష, రూ.రెండు వందల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు.